సాక్షి పల్నాడు

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



కాళికామాత ఆలయ వార్షికోత్సవం

మాచవరం: మండలంలోని పిన్నెల్లిలో ఉన్న కాళికాదేవి ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.



చెరువులకు సాగర్ జలాలు

ఫిరంగిపురం: మండలంలోని 11 గ్రామాల్లోని చెరువులను సాగర్‌జలాలతో నింపుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణ తెలిపారు. చెరువులను శనివారం ఆయన పరిశీలించారు.



ఈవీఎంలు తరలింపు

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న గోడౌన్ నుంచి నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను తరలించే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం పర్యవేక్షించారు.





గుంటూరు జిల్లా మంగళగిరిలో శనివారం నిర్వహించిన చేనేత కార్మికుల ముఖాముఖి కార్యక్రమంలో వేదికపై నుంచి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్. వేదికపై రీజనల్ కోఆర్డినేటర్ అయోధ్యరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కిలారి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య, గంజి చిరంజీవి



జగనన్న సభకు ఉత్సాహంగా...



వైఎస్సార్‌సీపీ రంగుల నూలు దండతో ఓ అభిమాని

జై కొట్టిన గుంటూరు

- జిల్లాలో ముగిసిన మేమంతా సిద్ధం యాత్ర
- చేనేతలతో ముఖాముఖి
- అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు
- యువకుల బైక్ ర్యాలీలు
- జాతీయ రహదారిపై బారులు తీరిన జనం
- అడుగడుగునా ఘన స్వాగతం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు గుంటూరు జిల్లా జై కొట్టింది. బస్‌యాత్రకు జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. శనివారం నంబూరు క్రాస్ రోడ్డు నుంచి యాత్ర మొదలైంది. జిల్లాకు చెందిన పలువురు బీజేపీ, జనసేన నేతలు జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం బయలుదేరిన ఆయనకు వేలాదిమంది స్వాగతం పలికారు. రెయిన్ ట్రీపార్కు వద్ద గజమాలతో స్వాగతం లభించింది. కాజా టోల్‌గేట్ వద్ద సీఎం వైఎస్ జగన్‌కు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి యువకులు ర్యాలీగా బస్సు యాత్రకు ముందు నడిచారు. మంగళగిరి బైపాస్ వద్ద బైక్ ర్యాలీతో కార్యకర్తలు స్వాగతం పలికారు.

బీసీల సీట్లలో బాబు, లోకేష్ పోటీ

వైఎస్ జగన్ అక్కడి నుంచి నేరుగా సీకే కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ చేనేతలను ఉద్దేశించి ప్రసంగించారు. మంగళగిరిలో చేనేతలు ఎక్కువ ఉన్నందున ఆర్కేతో మాట్లాడి చేనేత కుటుంబానికి చెందిన నా చెల్లెమ్మ మురుగుడు లావణ్యకు టికెట్ ఇచ్చామని జగన్ చెప్పారు. ఆర్కే కూడా సానుకూలంగా స్పందించారని కొనియాడారు. మరోవైపు బీసీలు ఎక్కువగా ఉన్న సీట్లలోనే చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేష్ పోటీ చేస్తున్నారని విమర్శించారు. లోకేష్ డబ్బులు పంచి గెలవాలనుకుంటున్నారని, ఆయన ఇచ్చే డబ్బులు తీసుకుని ఓటు మాత్రం మంచి చేసే లావణ్యకు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.





అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్, నంబూరు వద్ద జగన్ చూసేందుకు తరలివచ్చిన జనసందోహం

కొనుగోలు చేసైనా ఇళ్ల స్థలాలు ఇస్తాం...

మంగళగిరి నియోజకవర్గ పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై కోర్టులకు వెళ్లి చంద్రబాబునాయుడు, లోకేష్ అడ్డుకోవడాన్ని ఆయన ప్రస్తావించారు. పేద మహిళల చేతుల్లో పది నుంచి రూ.15 లక్షల విలువైన భూమిని పెట్టాలని అనుకున్నామని దాన్ని సుప్రీంకోర్టు వరకూ వెళ్లి అడ్డుకున్నారని చెప్పారు. ఆరు నెలల్లో సమస్య పరిష్కారం కాకపోతే డబ్బులతో స్థలం కొని అయినా నియోజకవర్గ ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. పేదలకు లబ్ధి జరగకుండా అడ్డుకున్న వారు ఓట్ల కోసం వస్తే గట్టిగా నిలదీయాలని పిలుపునిచ్చారు. చేనేత వర్గాలకు అన్ని విధాలా లబ్ధి చేకూరుస్తున్నామని, భవిష్యత్‌లో మరింతగా వారికి లబ్ధి చేకూరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

జనసంద్రంగా తాడేపల్లి



బస్సు యాత్ర కొలనుకొండ, వడ్డేశ్వరం, కుంచనపల్లి మీదుగా తాడేపల్లి చేరుకుంది. తాడేపల్లి జంక్షన్ జనసంద్రంగా మారింది. బస్సుయాత్రకు మేమంతా సిద్ధమంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీసి, హారతులతో స్వాగతం పలికారు. తాడేపల్లి జంక్షన్‌లో ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్రకు ఆయన సతీమణి వైఎస్ భారతి సంఘీభావం ప్రకటించారు. తాడేపల్లి జంక్షన్‌లో జనంతో కలిసి సాధారణ మహిళలా నిలబడిన వైఎస్ భారతి ముఖ్యమంత్రికి అభివాదం చేశారు. ప్రతిగా బస్సులో నుంచి ముఖ్యమంత్రి కూడా అభివాదం చేస్తూ ముందుకు సాగిపోయారు.

ఘనంగా వీడ్కోలు

సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో బస్ యాత్ర గుంటూరు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించింది. వీడ్కోలు చెప్పేందుకు గుంటూరు జిల్లా ప్రజానీకం పెద్ద ఎత్తున రాగా, స్వాగతం పలికేందుకు ఎన్టీఆర్ జిల్లా అభిమానులు కూడా తరలిరావడంతో కృష్ణమ్మ సాక్షిగా కనకదుర్గవారధిపై జనప్రవాహం ఉరకలెత్తింది.



యువ ఉత్తేజం...సీఎం వైఎస్ జగన్ కాన్వాయ్‌ను బైక్‌లపై అనుసరిస్తున్న యువకులు



దండాలయ్యా...సీఎంకు మోకాళ్లపై నమస్కరిస్తున్న అభిమానులు



తాడేపల్లి వద్ద హాజరైన ప్రజలు



పూల వర్షం...సీఎం జగన్‌పై గులాబీలు చల్లుతున్న అభిమానులు

జననేత జగనన్న సీఎం కావటం ఖాయం

- పవన్ వ్యాఖ్యలు సినిమా డైలాగులే
- జన్మభూమి కమిటీలను తీసుకురావాలనే దురాలోచనలో చంద్రబాబు, పవన్‌లు
- పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్, గోపిరెడ్డి

నరసరావుపేట: మేమంతా సిద్ధం బస్సు యాత్రకు మహిళలు చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కావటం ఖాయమని పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక కాకుమాను బజారులోని దేవీ పంక్షన్ హాలులో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్లమెంటు అభ్యర్థి అనిల్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి పల్నాడు జిల్లాలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బస్సుయాత్ర విజయవంతమైందని తెలిపారు. అడుగడుగునా ప్రజలు జననేతకు నీరాజనం పలికారని, ఊర్లకు ఊర్లు తరలి వచ్చాయని చెప్పారు. ప్రతి గ్రామ జంక్షన్‌లో ప్రజలు రోడ్లకు ఇరువైపులా నిలబడి స్వాగతం పలికారని వివరించారు. 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం కానున్నాయని, ఐదేళ్ల సుపరిపాలనకు మద్దతు పలికారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు మొన్నటి దాకా వలంటీర్లను తిట్టాడని, చివరకు తాను కూడా ఆ వ్యవస్థను కొనసాగిస్తానని, వారికి రూ.10వేలు జీతం ఇస్తానని ప్రకటించటాన్ని బట్టి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సమర్థించాడని భావిస్తున్నారన్నారు. రాష్ట్ర నాయకుడిగా వ్యవహరించాల్సిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ చివరకు పిఠాపురం నియోజకవర్గానికే పరిమితమయ్యాడని విమర్శించారు. తనకు కేటాయించిన 21సీట్లలో ఒకరు లేదా ఇద్దరు అభ్యర్థులకంటే గెలవరని స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపుతామని పవన్ అంటున్నాడని, బీజేపీతోనే ఉన్న గత ఐదేళ్లుగా ఏమీ చేయలేకపోయాడని, అతని ప్రకటనలన్నీ సినిమా డైలాగులేనంటూ కొట్టి పారేశారు. 2014లో 650హామీలు ఇచ్చి, వాటిలో పదిశాతం కూడా నెరవేర్చని చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్, సెవెన్ అంటూ ప్రజల్ని మరోసారి మోసం చేసేందుకే వస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ సీఎం సిద్ధం సభలకు తరలి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పిడుగురాళ్లలో సభ విజయవంతమైందని, సత్తెనపల్లిలో రోడ్‌షో జనాలతో అదిరిందని వెల్లడించారు. వలంటీరు వ్యవస్థను చూసి బాబు, పవన్‌లు ఇద్దరూ భయపడుతున్నారన్నారు. దానిపై అనేక విమర్శలు, ఆరోపణలు చేసిన వారు ఒక్క నెల ఇళ్లకు పింఛన్ ఇవ్వకపోవడంతో ఆ వ్యవస్థను కొనసాగిస్తామని, వలంటీర్లపై తమకు వ్యతిరేకత లేదని ప్రకటించారని తెలిపారు. నిజానికి వారు ఈ వ్యవస్థను తొలగించి మళ్లీ జన్మభూమి కమిటీలను తీసుకురావాలనే దురాలోచనలో ఉన్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉందని, వారి ఆశలు, ఆశయాలకు అనుగుణంగానే పార్టీ మేనిఫెస్టో ఉండనుందని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధిలోకి రావాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ విజయం సాధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో పల్నాడు అర్బన్ జిల్లా డెవలప్‌మెంటు అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడికి ధూళిపాళ్లలో నిరసన



ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న ప్రజలు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, లోకేష్ రెచ్చగొట్టే వాఖ్యలతో టీడీపీ రౌడీమూకలు పథకం ప్రకారమే దాడి చేశాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ తెలిపారు. విజయవాడ సింగ్ నగర్‌లో ముఖ్యమంత్రిపై క్యాట్ బాల్‌రాయితో జరిగిన దాడిని నిరసిస్తూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని భాగ్యనగర్ కాలనీలో గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలవుతున్నామనే సంకేతాలతోనే కుట్ర రాజకీయాలతో టీడీపీ నాయకులు పథకం ప్రకారం దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. పల్నాడు జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా ప్రజలు జగన్‌కు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. తక్షణమే పోలీసులు విచారణ జరిపి సీఎం జగన్ పై దాడికి పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్, సిబ్బంది ఆందోళనకారులతో చర్చించి నిరసన విరమింపజేశారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం

పట్నంబజారు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ గుండాల దాడితో జిల్లాలో ఆగ్రహజ్వాలలు రగిలాయి. మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా శనివారం విజయవాడ రోడ్డు షో నిర్వహిస్తున్న ఆయనపై దాడిని జిల్లా ప్రజలు ముక్తకంఠంతో ఖండించారు. ఈ మేరకు సీఎం వై.ఎస్.జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం రాత్రి చంద్రమౌళినగర్‌లో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు రోడ్డెక్కారు. సీఎం వై.ఎస్.జగన్‌పై జరిగిన దాడి దారుణమని, ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ గుండాలు ఉద్దేశపూర్వకంగానే సీఎం జగన్‌పై రాళ్ల దాడిచేశారని మండిపడ్డారు. దాడిని తీవ్రంగా ఖండిస్తూ సుమారు గంటన్నరకు పైగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాస్తారోకో చేపట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ కార్యకర్తల ఆగ్రహం చల్లారలేదు. పలువురు కార్పొరేటర్‌లు మాట్లాడుతూ మేమంతా సిద్ధం కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని టీడీపీ నేతలు సిగ్గులేని రాజకీయాలకు తెరతీశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసే విధంగా ముఖ్యమంత్రిపై దాడిచేయించడం టీడీపీ నేతల దుశ్చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు వైఎస్సార్‌సీపీ, సీఎం జగన్ భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు సర్దిచెప్పడంతో వైఎస్సార్‌సీపీ నేతలు ఆందోళన చేపట్టారు.

జగన్‌పై దాడి బాబు ఓటమికి సంకేతం

చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి

చిలకలూరిపేట: నారా చంద్రబాబు నాయుడు చిల్లర రాజకీయాలు చేయడం అతని నీచస్థితిని వ్యక్తం చేస్తుందని వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు విమర్శించారు. సిద్ధం బస్సు యాత్రలో భాగంగా పర్యటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై బంతిపూలలో రాళ్లను ఏర్పాటు చేసి దాడి చేయడం హేయమైన చర్య అని ఆయన ఖండించారు. ఈ చర్య టీడీపీ నేతల అరాచకత్వానికి అద్దం పడుతుందని, ఇంత నీచమైన చర్యకు చంద్రబాబు పాల్పడడం ఓటమికి సంకేతమని స్పష్టమవుతోందని తెలిపారు. మహాకూటమి ఏర్పడినా, ఎన్ని పార్టీలు పొత్తులు కలిసినా సింగిల్‌గా వచ్చే జగన్‌ను ఏమీ చేయలేవని పేర్కొన్నారు. . సంక్షేమ ప్రదాత జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల అండ ఉందని, మళ్లీ అధికారం చేజిక్కించేందుకు సిద్ధంగా ఉన్నారని కావటి చెప్పారు.

వాహన తనిఖీల్లో రూ.9.30 లక్షలు లభ్యం



నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ రవికృష్ణ

చిలకలూరిపేట టౌన్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిలకలూరిపేట రూరల్ మండలం మిట్టపాలెం గ్రామ పరిధిలో ఉన్న చెక్‌పోస్టు వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన కారులోని ఓ సంచిలో రూ.9.30 లక్షలు నగదు లభించింది. ఎలాంటి ఆధారాలు, బిల్లులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల శివారు రెడ్డిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 25 కుటుంబాలు టీడీపీని వీడి శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) సాదరంగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పిలిచి కండువాలు కప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారని పేర్కొన్నారు. పార్టీకి సేవలందించిన ప్రతి ఒక్కరినీ ఆయన ఆదరిస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మందాళ్ల అంజిరెడ్డి, మేకల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం మాజీ అధ్యక్షుడు అల్లు వెంకటేశ్వరరెడ్డి, మేకపోతు పెదశ్రీనివాసరెడ్డి, మందాళ్ల లింగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి : ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక సీపీఐ కల్యాణ మండపంలో ఆర్యవైశ్యులు ఆత్మీయ సమావేశం శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం కల్పించామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో రాజకీయంగా ఉన్నత పదవులు కేటాయించామని చెప్పారు. దాచేపల్లి పట్టణంలో అత్యధికంగా వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే ఆర్యవైశ్యులకు ఆస్తి నష్టం జరగకుండా కాటేరువాగును ఆధునికీకరణ చేసి వరద ముప్పునుంచి కాపాడామని తెలిపారు. కొట్ల బజార్‌లో రూ3.50 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మించామన్నారు. ఆర్యవైశ్యులలోని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశామని, త్వరలోనే ఇళ్లు కూడా మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యుల శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని, నారాయణపురంలో కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయిస్తానని తెలిపారు. నాగులేరులో లోలెవల్ చప్టా బ్రిడ్జి నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం చేసి చూపించామని, ఆర్యవైశ్యులకు అండగా ఉన్న తమను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాసు కోరారు. అనంతరం ఎమ్మెల్యే కాసుని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు నాగుండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, వార్డు ఇన్‌చార్జి కనమర్లపూడి గోపి, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గరిణే పుల్లారావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ మండ్లేం రామారావు, మాజీ డైరెక్టర్ నాళం శ్రీనివాసరావు, నాయకులు చిట్టిప్రోలు అమరలింగేశ్వరరావు, బొడ్డు నాగేశ్వరరావు, పసుమర్తి శ్రీనివాసరావు, మాశెట్టి కిశోర్, స్వామి మల్లేశ్వరరావు, కాకుమాను విజయ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

- రైల్లో అక్రమంగా తరలిస్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి
- రూ.75 వేల విలువైన 30 బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడితో రైల్వే ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది

నరసరావుపేట టౌన్: కాచిగూడ టు గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న రూ.75 వేల విలువైన 30 బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్ఐ టి. సుబ్బారావు తెలిపారు. స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నంబర్ 1 వద్ద తనిఖీలు చేపట్టగా ప్రకాశం జిల్లా రాచర్ల మండలం, రామాపురం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. విచారణలో నిందితుడు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిగా గుర్తించామని చెప్పారు. బెంగళూరు నుంచి తక్కువ ధరకు మద్యాన్ని తీసుకొచ్చి ఆంధ్రాలో విక్రయాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెంలో విక్రయించేందుకు వెళుతుండగా పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు.

నిర్మాతగా మారిన సినీనటి జయలక్ష్మి



దర్శకుడు శివాజీకి చిత్రం స్క్రిప్ట్ అందజేస్తున్న హరిదాసు శ్రీనివాస్, పక్కన సినీనటి జయలక్ష్మి

యడ్లపాడు: గుంటూరు జిల్లాకు చెందిన అంతర్జాతీయ కూచిపూడి నృత్య కళాకారిణి, సినీ నటి హరిదాసు జయలక్ష్మి నిర్మాతగా మారారు. రైతు సాగుకు ఉపయోగించే కాడెడ్ల గురించి భావితరాలకు చెప్పాలంటే మ్యూజియానికి వెళ్లాల్సిన పెను ప్రమాదం ముంచుకొస్తుందంటూ జన జాగృతం చేసే సమకాలీన కథతో జయలక్ష్మి మూవీ ల్యాండ్ బ్యానర్‌పై ''మట్టి మనిషి'' (భూమి పుత్రుడు) ట్యాగ్‌లైన్‌తో సినిమా తీస్తున్నట్లు ఆమె చెప్పారు. చిత్రం పూజా కార్యక్రమాన్ని తమ నివాసంలో నిర్వహించామని శనివారం వెల్లడించారు. స్క్రిప్ట్ స్క్రీన్‌ప్లే సహా పూర్తికాగా, తొలిపూజ చేసినట్లు చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడులోని జయలక్ష్మి మూవీ ల్యాండ్ థియేటర్ వద్ద తొలిషాట్ షూట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు శనివారం ఆమె తెలిపారు. చిత్ర నిర్వహణ బాధ్యతలు హరిదాసు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కుమారి శృతినాయుడు వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ డైరెక్టర్ వాసు శిష్యుడు శివాజీ ఈ చిత్రానికి దర్శకుడిగా పరిచయం కానుండగా, సింధు కే ప్రసాద్ సంగీతం అందించనున్నట్లు ఆమె చెప్పారు. జులై మొదటి వారం నుంచి కోనసీమలో సింగిల్ షెడ్యూల్‌తో సినిమా షూటింగ్‌ను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

రూ.2,70 లక్షల విలువైన వెండి స్వాధీనం

కేసు నమోదు చేసిన జీఆర్పీ పోలీసులు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో రూ.2.70 లక్షల విలువైన వెండి వస్తువులను జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే జీఆర్పీ సీఐ గంగావెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీలలో ప్రయాణికుడు గడ్డెం విజయకుమార్ వద్ద 3.2 కిలలో వెండి వస్తువలను పరిశీలించారు. అతడి వద్ద ఎలాంటి రసీదులు, జీఎస్టీ రసీదులు లేకపోవడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి జీఎస్టీ అధికారులకు అప్పగించారు. ఎన్నికల సమయంలో కచ్చితంగా అనుమతులు ఉండాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని సీఐ గంగా వెంకటేశ్వర్లుతెలిపారు.

చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థినుల సత్తా

రాష్ట్రస్థాయిలో ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో టాపర్లు



విద్యార్థినులు అఖిల, పాదిలిమలను అభినందిస్తున్న హెచ్‌ఎం ఝాన్సీవాణి

నాదెండ్ల: ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. సెకండ్ ఇయర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో సీహెచ్. అఖిల 977/1000, బైపీసీలో వి. పాదిలిమ 976/1000 సాధించి రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచారు. పల్నాడు జిల్లాలో 14, రాష్ట్ర స్థాయిలో 164 పాఠశాలలు ఉన్నాయి. మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 82 శాతం, రెండో సంవత్సరం 76 శాతం ఫలితాలు సాధించారు. గతేడాది కూడా ఇదే తరహా ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. ఝాన్సీవాణి తెలిపారు. రాష్ట్రస్థాయిలో తమ పాఠశాల పేరు నిలిపినందుకు విద్యార్థినులు అఖిల, పాదిలిమను ఆమె అభినందించారు. ఇద్దరి తల్లిదండ్రులు సాధారణ వ్యవసాయ కూలీ పనులు చేసుకునే వారని, వారి కుమార్తెలు మంచి ఫలితాలు సాధించడం ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌పై దాడి హేయమైన చర్య

పట్నంబజారు: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో విజయవాడ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా శనివారం రాత్రి ఒక ప్రకటనలో ఖండించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలను కలుస్తూ ముందుకు సాగుతున్న సీఎం జగనన్నపై ఇలాంటి దాడులు చేయడం సిగ్గుచేటని తెలిపారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి దాడులు చేయిస్తున్నాయని ఆరోపించారు. 'సిద్ధం' బస్సుయాత్రకు వస్తున్న స్పందన చూసి ఓర్వలేక టీడీపీ కూటమి ఇలాంటి దాడులకు తెగబడుతుందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని నూరిఫాతిమా హెచ్చరించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

నరసరావుపేట టౌన్: అగ్నిమాపక వారోత్సవాలను విజయవంతం చేయాలని అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు శనివారం ప్రజల్ని కోరారు. జిల్లా అధికారి ఎస్. శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, పెట్రోలు బంకులు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.